క్లుప్తంగా

మహాశివరాత్రి ప్రత్యేకాధికారిగా రామచంద్రమోహన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవాలకు ప్రభుత్వం రామచంద్ర మోహన్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవదాయశాఖలో ఏడీసీగా పనిచేస్తున్న ఆయన ఈ నెల 10 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పర్యవేక్షిస్తారని ఆలయ అధికారులు తెలియజేశారు.

సచివాలయాల తనిఖీ



పెరిందేశంలో సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్ర

కేవీబీపురం: మండలంలోని తిమ్మసముద్రం, పెరిందేశం, ఆదవరం సచివాలయాలను ఎంపీడీఓ రామచంద్ర గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. పెరిందేశం సచివాలయ పరిధిలో పని చేస్తున్న ఐదుగురు వలంటీర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెరిందేశంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, చెల్లించిన బిల్లులను ఆయన పరిశీలించారు.

108లో ప్రసవం

కేవీబీపురం: మండలంలోని తిమ్మనాయుడు గుంట గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి(22) 108లో ప్రసవించింది. గురువారం వేకువజామున పురిటినొప్పులు మొదలవడంతో కుటుంబ సభ్యుల సమాచారంతో 108 అంబులెన్సు అక్కడికి చేరుకుంది. 108లో ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఈఎంటీ అన్బురాజ్, పైలెట్ సురేష్ వాహనాన్ని తెలుగుగంగ కాలువ వద్ద ఆపి ఆశా వర్కర్ సాయంతో కాన్పు చేశారు. వెంకటలక్ష్మి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సరైన సమయంలో సురక్షితంగా కాన్పు చేసిన 108 సిబ్బందికి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తల్లీ బిడ్డను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ క్షేమంగా ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు కల్వర్టుకు ఏర్పడిన గొయ్యి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడంతో ప్రమాదాలకు దారితీస్తోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టు నిర్మించి 20 ఏళ్లు కావస్తుండడంతో దెబ్బతింది. కల్వర్టుకు గొయ్యి మూలాన వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులైనా స్పందించి మరమ్మతులు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పన్ను చెల్లించకపోతే జరిమానా



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: వాహనదారులు సకాలంలో పన్ను చెల్లించకపోతే 200 శాతం జరిమానా చెల్లించవలసి వస్తుందని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రెండు లారీల వాహనాల రికార్డులు సక్రమంగా లేకపోవడంతో వాటికి జరిమానా విధించారు. కార్యక్రమంలో సిబ్బంది కామాక్షయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా రవిరెడ్డి



వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా దాసుకుప్పం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆలపాటి రవిరెడ్డి నియమితులయ్యారు. గురువారం సాయంత్రం సత్యవేడులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రవిరెడ్డిని నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. పలువురు సర్పంచులు ఆయనను అభినందించారు.

మళ్లీ జగనన్నను సీఎం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం



హాజరైన గృహ సారథులు, గ్రామ వలంటీర్లు

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు
- గృహ సారథులు, కన్వీనర్లకు శిక్షణ

వరదయ్యపాళెం: ప్రజలకు మరింత చేరువై వారి మద్దతుతో 2024 ఎన్నికల్లో కూడా మళ్లీ జగనన్న గెలిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, పార్టీ శ్రేణులు పనిచేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం సత్యవేడులో ఏర్పాటు చేసిన గృహ సారథులు, కన్వీనర్ల శిక్షణా సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మార్గదర్శనం చేశారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ, జెడ్పీటీసీ విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సోమశేఖర్, ఎంపీటీసీలు శరవణ, బాలయ్య, సర్పంచులు రవిరెడ్డి, మధురాజు, గోవిందస్వామి, శేఖర్, సన్యాసయ్య, పార్టీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, ఎంపీ రవి, ఢిల్లీబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా పళ్లికొండేశ్వరాలయ చైర్మన్‌గా నియమితులైన ఏపీఎం బాలాజీ రెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

శిరణంబూదూరులో గడప గడపకు..

సత్యవేడు మండలంలోని శిరణంబూదూరులో గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 450 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. లబ్ధిదారుల పేరిట ముద్రించిన సంక్షేమ పథకాల కరపత్రాలను వారికి అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. స్థానికంగా కొన్ని వీధుల్లో సీసీ వేయాలని గ్రామస్తులు వినతిపై ఎమ్మెల్యే స్పందించారు. దశలవారీగా రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ ఆనంద్, ఎంపీటీసీ సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓడూరు సుందరరామిరెడ్డికి నివాళి



ఓడూరు సుందరరామిరెడ్డి చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధరరెడ్డి తండ్రి సుందరరామిరెడ్డికి గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. నాయుడుపేటలోని ఓడూరు గిరిధర్‌రెడ్డి స్వగృహంలో ఓడూరు సుందరరామిరెడ్డి కర్మక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు మహర్దశ

- చైర్మన్ అంజూరు



బాలాలయ స్థాపన పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, పూజలో చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి దేవస్థాన అనుబంధ శ్రీ నీలకంఠేశ్వరస్వామి, శ్రీ అగస్తీశ్వరస్వామి, భక్తకన్నప్ప ఆలయాల మహా కుంభాభిషేకం, కలశ స్థాపన, విశేష హోమ పూజాది కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. అలాగే తొట్టంబేడు మండలం పెద్ద కన్నలిలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించి 14 ఏళ్లు అయిన సందర్భంగా ఆలయ మహా కుంభాభిషేకం నిర్వహణ, జీర్ణోద్ధరణ పనులకు బాలలయ స్థాపన పూజలు గురుకుల్ ఎస్ఎంకె స్వామినాథ స్వామి ఆధ్వర్యంలో చేశారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మహా కుంభాభిషేకం చేయనున్నారు. శ్రీకాళహస్తీశ్వర పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో పురాతన ఆలయాలకు మహా కుంభాభిషేకాలు నిర్వహించి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. పూజాది కార్యక్రమాల్లో దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, ఆలయ అధికారులు ఈఈ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ శోభారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్, స్థపతి కుమార్, అనుబంధ ఆలయాల ఇన్‌చార్జ్ లక్ష్మయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి ,ధర్మకర్తల మండలి సభ్యులు, రమాప్రభ, సునీత , లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు నీలా, ఆలయ పురోహితులు అర్ధగిరిస్వామి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం కర్ణాటక రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ రోహిణి సింధూరి, ప్రేమారవింద పూజశ్రీ భిక్షమయ్య గురూజీ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు.

రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



సత్యవేడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు భోజన వసతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- సత్యవేడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు భోజన వసతి
- ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: దూరప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. కొన్నిరోజులుగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆగిపోయిన రోగులకు ఉచిత భోజన కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పునః ప్రారంభించి మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఆసుపత్రి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేశానన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడలేదని, కోవిడ్ సమయంలో కూడా హీరో, అపోలో, శ్రీసిటీ సహకారంతో నూతన బెడ్లు, అంబులెన్స్, భోజన వసతులు కల్పించామన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు, వివిధ రకాల పరీక్షలు చేసేందుకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులకు వైద్యం కోసం త్వరలోనే గైనకాలజిస్టును కూడా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ, జెడ్పీటీసీ విజయలక్ష్మి, వైద్యాధికారులు సురేష్, విద్యాసాగర్, మానస, చంద్రన్, దక్షిణామూర్తి, హరిప్రసాద్, ఆసుపత్రి సలహా సంఘం సభ్యులు గోవిందస్వామి, మునికృష్ణయ్య, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

నేడు వరదయ్యపాళెంలో గడప గడపకు..

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం-1లో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో గృహ సారథులు, గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సాదర స్వాగతం



రేణిగుంట విమానాశ్రయం నుంచి వెలుపలికి వస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

రేణిగుంట: వైఎస్సార్ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి సాదర స్వాగతం లభించింది. ఆయనకు జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో స్వాగతం పలికారు. వీరితోపాటు ఆర్డీఓలు రామారావు, కనకనరసారెడ్డి, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు తదితరులు కూడా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కడప కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్ వర్మతో కలసి వైఎస్సార్ కడపకు బయల్దేరి వెళ్లారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, అంగన్‌వాడీ కేంద్రం మహిళలు

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని కోబాక అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆ ఆవిష్కరణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో నిర్వహించే మహాశివరాత్రి పర్వదినాన బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. దళిత, గిరిజనుల గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. అధికారులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంరక్షణ కార్యదర్శి ధరణి, అంగన్‌వాడీ కార్యకర్త శారద, మహిళలు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని జగనన్న కాలనీలో కుష్ఠు వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్న పాండూరు సెక్టార్ డీపీఎంఓ వేణుగోపాల్ మాట్లాడారు. కుష్ఠు వ్యాధి ఎలా సంక్రమిస్తుంది? వ్యాధి లక్షణాలు, స్వీయ నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నుంచి విముక్తి పొందడానికి ప్రభుత్వాస్పత్రుల్లో ఇచ్చే మందుల గురించి తెలియజేశారు. ఎవరైనా అనుమానిత లక్షణాలతో ఉన్నపక్షంలో ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, యంఎల్‌హెచ్‌పీలకు తెలియజేసి, వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఉచితంగా మందులు వచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వరలక్ష్మి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని రాజీవ్‌నగర్ వ్యవసాయ భూముల సమీపంలో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.4180 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయడం ముఖ్యం

- రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపులో డీఎస్పీ విశ్వనాథ్



డ్రైవర్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

శ్రీకాళహస్తి రూరల్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే ప్రమాదాలకు తావిచ్చినట్లేనని శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్ హెచ్చరించారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా డీఎస్పీ మాట్లాడారు. ఆర్టీసీ సర్వీసుల్లో వెళితే సురక్షిత ప్రయాణమనే నమ్మకంతో ప్రయాణికులు వస్తూంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేసి, వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు దృష్టి సారించి డ్రైవింగ్ చేస్తే మన ప్రాణాలు మనమే కాపాడుకోవచ్చన్నారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డీఎం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో హైవేలు అందుబాటులోకి రానున్నాయని, వీటిని దృష్టిలో ఉంచుకుని డ్రైవర్లు రహదారి నిబంధనలు విధిగా పాటించాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఎం.వెంకటేశ్వర్లు, జే.అమీర్, జీ.సుబ్బయ్యను డీఎస్పీ చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, మెకానికల్ ఇంజినీరు చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, వైడీ.కుమార్, సంస్థ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకు ఫిజియోథెరపీపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): మోకాళ్లు, నడుము నొప్పి, ఇతర నొప్పులతో బాధపడుతున్న వారు ఫిజియోథెరపీతో ఆ బాధల నుంచి విముక్తి పొందవచ్చని హైదరాబాద్ నిజా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సంతోష్ కుమార్ రెడ్డి అన్నారు.గురువారం తొట్టంబేడు మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో మహిళలకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెయిన్ కిల్లర్లు వాడడం వలన దుష్పలితాలు చవిచూస్తారని, భవిష్యత్తులో ఆరోగ్యపరంగా పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎవరైనసూ సాధారణంగా నొప్పులకు మాత్రలు వాడుతూ ఉంటారని, అలా కాకుండా ఫిజియోథెరపీ చేస్తే నొప్పులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, సీసీలు, మహిళా సమైఖ్య లీడర్లు, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దాం



కరకంబాడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేణిగుంట: రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలనను చూసి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మండలంలోని కరకంబాడి, తారకరామానగర్ సచివాలయాల పరిధిలోని పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు పీడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం నిర్వహించరూ!

- టీటీడీ అధికారులకు తొండమాన్‌పురం గ్రామస్తుల వినతి



టీటీడీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో తొండమాన్‌పురంలోని టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని బ్రహ్మోత్సవాల సమయంలో గ్రామోత్సవం నిర్వహించాలని గ్రామస్తులు టీటీడీ అధికారులను కోరారు. గురువారం ఆలయ ఆవరణలో టీటీడీ అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆగమ శాస్త్రం ప్రకారం గ్రామ పొలిమేర స్వామి అమ్మవార్లు దాటకూడదని, గతంలో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించేవారని, ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలలోనూ అదే తీరులో గ్రామోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆలయాన్ని టీటీడీకి అనుబంధం చేయడంతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీటీడీ స్పెషల్ డెప్యూటీ ఏఈఓ ఫణిభూషణ్‌రెడ్డి, టీటీడీ అధికారులు దేవేందర్‌బాబు, పార్థసారథి, శ్రీనివాసులు, మహేష్‌బాబు, శైలేంద్రబాబు, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద పడిగాపులు



ఖాళీగా ఉన్న డీటీ కుర్చీ



అధికారుల కోసం కార్యాలయంవద్ద ఎదురు చూస్తున్న మహిళా రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక తహసీల్దారు కార్యాలయ సిబ్బంది గురువారం విధులకు ఆలస్యంగా రావడంతో ప్రజలు చెట్ల కింద పడిగాపులు కాశారు. తహసీల్దారుతో సహా డిప్యూటీ తహసీల్దారు, వీఆర్‌ఓలు సమయానికి విధులకు హాజరు కాలేదు. ఇక్కడ బయోమెట్రిక్ హాజరు ఉంటున్నా సకాలానికి ఉద్యోగులు రాకపోవడంపై వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధికారులతో సహా ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నీటి నిర్వహణలో శ్రీసిటీ పనితీరు భేష్!

- తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు రెడ్డి



శ్రీసిటీ ప్రతినిధులతో సమీక్షిస్తున్న తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు రెడ్డి

వరదయ్యపాళెం: నీటి నిర్వహణ, వర్షపునీటి సంరక్షణలో శ్రీసిటీ చేస్తున్న కృషి అభినందనీయమని తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు రెడ్డి ప్రశంసించారు. సీనియర్ ఇంజినీర్ల బృందంతో ఆయన గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, నీటి సంరక్షణ చర్యలు, వర్షపునీటి సేకరణ, పరిశ్రమలకు నీటి అవసరాలు గురించి శ్రీసిటీ వ్యాపార వాణిజ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చర్చించారు. అలాగే తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి నీటి కేటాయింపులు, ఇతర సంబంధిత అంశాలను కూడా చర్చించారు. ఆయన వెంట శ్రీకాళహస్తి ఈఈ సుబ్రమణ్యం ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

చిల్లకూరు: జాతీయ రహదారిపై వెళ్తున్న కారును ఓ టిప్పర్ ఢీకొనడంతో కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. తృటిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన బాబాయ్య శ్రీహరి కోటలోని షార్‌లో పని చేస్తూ పదవీ విరమణ చేశారు. ఆయన తన సతీమణితో కలిసి కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా కారు చిల్లకూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న టిప్పర్‌ను అధిగమించే ప్రయత్నం చేశారు. అమితే టిప్పర్ డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో కారును ఢీకొంది. దీంతో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అటుగా వెళ్లే వారు గమనించి హైవే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు.



క్రేన్ సాయంతో కారును బయటకు తీస్తున్న దృశ్యం

శ్రీవారి సేవలో శ్రీసిటీ జీఎం కుటుంబం



శ్రీసిటీ జీఎం రామచంద్రారెడ్డి కుమార్తె వినీష, దీపక్‌రాజ్ వివాహం గురువారం జరిగింది. అనంతరం నూతన వధూవరులతోపాటు కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల